# పులి

బస్సు ఘాట్ రోడ్డుమీదనించి పోతుంటే యెదురు చూస్తున్న నా కళ్ళకు ఒక పులీ అగపడలేదు. బహుశః నా చిన్ననాటి వూహాలోని అమాయకతలో కొంత యిప్పటికీ నిల్చిపోవటం వలన కామోసు పులిని పట్టపగలు రోడ్డు వార చూడాలన్న కోర్కె కలిగింది.

వంకర టింకరగా పోతున్న ఘాట్ రోడ్డుకు డీసెల్ బస్సు యెగబాకుతుంటే కొంతసేపటికి నా చిన్ననాటి దృశ్యాలు తలలో తిరిగాయి. ఆ రోజుల్లో ఈ ఘాట్ రోడ్లు నిచ్చెనలా వుంటాయనీ, పులులు కీకారణ్యంలో నున్న రోడ్లమీదే పడుకుంటాయనీ, పాప్పాంయ్ మని హారన్ కొట్టినా కదలవనీ...యిలా యెన్నో అనుకోడానికి ఆస్కారం ఇచ్చింది మా పెద్దమ్మ.

నా చిన్నతనంలో నేను మా తాతగారింట్లో వుండేవాడిని. మా పెద్దమ్మ మూడేళ్ళ కొకసారి కన్నవారింటికి వచ్చేది. మా పెద్దమ్మ భర్త యేజెన్సీ ప్రాంతంలో ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌లో పని చేసేవాడు. మా పెద్దమ్మ ఆ రోజుల్లో ఆ అడవిమధ్య గ్రామంనించి కొంత దూరం నడిచి, అక్కడినించి బండిమీద వచ్చి, తరువాత బస్సెక్కి, బస్సు దిగాక రైలెక్కి, రైలుదిగి మూడుమైళ్లు గూడుబండిమీద కన్నవారింటికి వచ్చేది. ఈ కూతురువస్తే పండగలా వుండేది. మా అమ్మమ్మ ఈ కూతుర్ని గట్టిగా కౌగలించుకుని దూరంగా వున్నదని ఏడ్చేది. మేం పిల్లలం – గూడుబండికి యెదురెళ్ళేవాళ్ళం. గూడుబండినిండా పెట్టెలతోబాటు, అడవిప్రాంతంలో దొరికే అన్ని వస్తువులూ వుండేవి. బండి వెనుక మా పెద్దమ్మ ఒడిలో బిడ్డతో కూర్చుండేది. ఆ బండినుంచి ఇంటికి కొండ చీపుర్లు, చాపలు, కందులబస్తా, తట్టాబుట్టా, విసనకర్రలు, గుమ్మడి కాయలు, చందనంకర్రలు వగైరా వగైరా యెన్నో వుండేవి – మా పెద్దమ్మ మనిషి పేరా యేదో ఒకటి తెచ్చేది. ఆ సారి నాకు ఒక పిల్లనగ్రోవి యిచ్చింది. అది యెలా వూదటమో పెద్దమ్మే నేర్పింది. ఆ పిల్లనగ్రోవి పట్టుకుని మామిడితోటకు పరుగెత్తాను. నాకు వచ్చిన సినిమా పాటలు, కూనిరాగాలు అన్నీ ఒంటిగా ఆలాపిస్తే నా చుట్టూ, నేనో పిట్టవనుకుని కామోసు రకరకాల పిట్టలు అరుస్తున్నాయ్. ఉత్సాహంతో పెద్దమ్మ దగ్గరకు వెళ్ళి–

“పెద్దమ్మా పెద్దమ్మా... ఈ పిల్లన కర్ర...పిట్టలు పాడే చోటునించి తెచ్చావు కదూ?” అన్నాను.

"కాదురా, పులులు అరిచేచోటునించి తెచ్చాను."

పులి పేరెత్తగానే నేను 'అమ్మో' అన్నా. పులిగురించి తెలుసుకోవాలనే వుబలాటంతో–

'పెద్దమ్మా... పెద్దమ్మా నీవు పులిని చూశావా?' అనడిగాను.

'చూడట మేమిటి? పులుల మధ్యనే మేం వుంటే!'

'అమ్మో... మధ్యనే, చంపేయవూ?'

ఆమె పులుల కథలు ఎన్నో చెప్పింది. అవి మేం కథల్లా విన్నా నిజంగా జరిగినవేనట. వాళ్ళు పెంచిన మాంచి బుల్ డాగ్ ని పులి యెలా ఎత్తుకుని పోయిందో, అవి పసికడ్తే కోళ్ళూ, ఆవులూ, యెక్కడున్నా కాజేస్తాయనీ, యిక్కడ కారులెలా అరుస్తాయో వాళ్ళింటిదగ్గిర పులులలా అరుస్తాయనీ, యిలా యెన్నెన్నో చెప్పింది.

నేను వయసులో విద్యలో పెరిగాక మా పెద్దమ్మ గోరంతలు కొండంతలు చేసి పులిగురించి చెప్పిందనుకున్నాను. ఆయుధాలు లేకుండా పులులూ, సింహాలతో పోట్లాడిన వీరులగాథలు నా చదువులో యిరికించడం వలన మనిషిచే ఓడిన పులి అంత భయంకరమైన జంతువు కాదని పులి అంటే నాకు భయం పోయింది. అలా అనుకుంటున్న రోజుల్లో మా పెద్దమ్మ కన్నవారి యింట్లో శాశ్వతంగా వుండిపోడానికి వచ్చింది. ఆమె భర్త పులుల వేటకు తన పైనున్న పెద్ద ఆఫీసర్లతో వెళ్లాడు. అతనిని ఎత్తుకపోయిన పులిని తుపాకితో పేల్చి చంపారు. గానీ అతని ప్రాణాన్ని రక్షించలేకపోయారు. ఈ సంఘటన విన్నాక నాకు మళ్ళీ పులంటే పక్క బెదురు కలిగింది. సర్కసులో బోనులో వున్న పులికంటే దాని రాజ్యంలో యేలుబడి చేస్తుండగా పులిని చూడాలన్న కోరిక యిప్పటికీ పోలేదు.

డీసెల్ బస్సు ఘాట్ రోడ్డు దిగుతూండగా దిగువనున్న దట్టమైన అడవిలో కోతులు, కొండముచ్చులే కనుపించాయి. చెట్లపైని, ఆకాశాన కదులుతున్న తెల్ల మేఘాల ఛాయలు అక్కడక్కడ పడ్తున్నాయి. కొండపై అప్పుడే పొగమంచు కదులుతోంది. కొద్దిగా చలివేస్తోంది. బస్సు ఆగింది. ఏదో చిన్న రిపేరు. ఇది పెద్ద రిపేరైతే ఈ రాత్రి యిక్కడ వుంటే–పులుల అరుపులు విని, వెన్నెట్లో వాటి పరుగు తిలకించేవాడిని. కానీ బస్సు కదలిపోయింది. నేను గమ్యస్థానం చేరేసరికి రాత్రి పదిగంటలయింది. ఆ రాత్రివేళ నాకోసం మా బావ జీపులో కాసుకు కూర్చున్నాడు. అప్పటికే మంచు కురుస్తోంది. చలి బ్రహ్మాండంగా వుంది.

మా బావ ఈ యేజన్సీ ప్రాంతంలో మూలనున్న గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసరుగా వుంటున్నాడు. ఉదయం పది గంటలవరకూ మంచు – కురుస్తూ వుంటుంది. సాయంత్రం అయిదు దాటితే యింటినుంచి కదలలేం. అంతా నిశ్శబ్దం. మనుషుల మాటలు కూడా మెల్లగా వస్తున్నాయి. ఒకోసారి వణుకుతూ అన్నమాటలు కూడా సరిగ్గా అర్థం కాలేదు. ఈ డాక్టరుకు రోజు ఒకటో అరో కేసు తప్పించి మరేం పని లేదు. ఎటుచూసినా కొండలు. కొండలపై పచ్చని అడవులు. ఆ అడవులపై నీలి ఆకాశం. ఆకాశంలో నిప్పులు కురవని సూర్యుడు – మంచు తెరల్లో చల్లబడి చంద్రునిలా పారిపోతున్నాడు. ఇక్కడ వుత్తేజపరచేదేదీ జరగటంలేదు. రెండు రోజులకే నాకీ ప్రదేశంపై మమకారం పోయింది.

"ఇక్కడ ఏం చూపించడానికి నన్నుపిల్చావు?" అడిగాను మా బావను నాల్గోరోజున.

"ఏం చూడాలని వచ్చావ్?"

ఈ ప్రశ్నకు సమాధానం వచ్చింది.

"పులులు – వాటి రాజ్యానికి పోవాలంటే యింకో యిరవైమైళ్ళు దక్షిణంగా పోవాలి. కచ్చా రోడ్డు. జీపుకి హెడ్డులైటు పెట్టి ఓరోజు వేటకెల్దాం."

"అక్కడ యింకా చూడవలసిన వేమైనా వున్నాయా?"

"ఉత్తరం వేపు రోడ్డులేదు. నడచి పదిమైళ్ళు దాటి కొండత్రోవను వెళ్ళామంటే... జంతువులు తప్పించి మనుషులు వుండరనుకున్న కారడవులో మనుషులున్నారని ఈమధ్యనే అంటే యేడాదై తెలుసుకున్నారు. ఆడా మొగా మొలకు ఆకులు తప్పించి ఒంటిమీద బట్ట వుండదు. దుంపలూ, కాయలూ తిని నీరు త్రాగుతారు. కొన్ని ఆకులుకూడా తింటూంటారు. ఇక నువ్వుగానీ అక్కడకు వెళ్లావంటే తిరిగి రావు."

"ఏం, బాణాలు వదుల్తారా?"

" ఆ ఆడవాళ్ళ బిగువుకు గులామై అక్కడే వుండిపోతావ్!" ఇక్కడ ఏదో ప్రాణం వున్నట్లనిపించింది. ఆ సాయంత్రం ఆ కొండల్లో వుత్తరం వేపు రేగిన పొగ రానురాను రాత్రి అయ్యాక మంటలయ్యాయ్. ఆ మంటల వెలుగులో ఆ బిగువైన ఆడవాళ్లు కనిపిస్తారేమోనని దీక్షగా కిటికీ సందునించి చూశాను.

"ఏం చూస్తున్నావ్?"

"చలికి ఆ నగ్న సుందరులు మంట వేసుకున్నారు."

"చలికి వేసుకున్న మంటలు యింత దూరానికి అగుపించవ్. అడవిని కాల్చుతున్నారు."

"దేనికి?"

"ఆ కాలిన స్థలంలో మెట్టపంటలు పండిస్తారు."

"కొండమీద యేం పండుతుంది? ఇటువేపంతా టేకు అడవుల్లా వున్నాయ్. కాల్చేస్తూంటే ప్రభుత్వం సహిస్తోందా?"

"సిబ్బంది భయపడి చూసీ చూడనట్లు వూరుకునేవారు. కానీ ఈమధ్య వచ్చిన ఫారెస్టు రేంజరు చాలా చండశాసనుడు."

నా మదిలో తలంపులు నా చలిని కొంతవరకు తగ్గించాయ్. ఎలాగైనా పులివేటతోబాటు ఆ నగ్నసుందరులను చూసి మరీ వెళ్తానని అనుకున్నాను. ఒక పావుగంటలో బయలుదేరతామనగా మా బావకు అర్జంటుగా మూడు కేసులొచ్చాయి, రమ్మని కబురొచ్చింది.

"కొట్లాట కేసులేమో. ఈవేళ మనం వెళ్ళలేమనుకుంటాను. నువ్వూ రాకూడదా?"

నేను మా బావ వెంటబడ్డాను. మూడు వుయ్యాలల్లో ముగ్గురు పేషెంట్లు వున్నారు. ఉయ్యాల మోసినవారిలో ఒక ఆడదికూడా వుంది. ముగ్గురిలో యిద్దరు త్రోవలోనే చచ్చిపోయారు. ఆ యిద్దరూ కాకీనిక్కరు చలిబనియన్లతో వున్నారు.

బ్రతికున్నవాడి మొలకు ఆకులు తప్పించి ఒంటిమీద బట్టలేదు. మాంచి పికపికమనే వయసులో వున్నాడు. బుర్ర పులిబుర్రలా వుంది. ఆ నోటిలో పళ్లు పులిపళ్ళల్లా వున్నాయ్ వాడికాళ్ళు, చేతుల వేళ్ళకు గోళ్ళు పెరిగి పులిగోళ్ళల్లా వాడిగా వున్నాయ్. వాడు యేదో అదేపనిగా కోదుభాషలో బొబ్బలు పెట్టున్నాడు. వెంటనే వాడిని ఆపరేషన్ టేబిల్ మీద పెట్టాడు డాక్టరు. నన్ను లోనికి రమ్మన్నా వెళ్ళలేదు. బయట మా వాడి వర్ణనకు తగినట్లే ఈ కోదు స్త్రీ వుంది.

తుపాకిదెబ్బ కుడితొడపై తిన్న ఆ కోదు భార్య అయివుంటుంది. వాడిని ఆ వుయ్యాల్లో మోసుకొని వచ్చింది. ఎటువంటి సిగ్గూ పడలేదు. నా కళ్ళ ముందు నిటారుగా నిల్చుని లోపలినించి యేం కబురొస్తుందోనని ఆత్రుతగా చూస్తోంది.

ఇంతలో బాగా చీకటిపడింది. ఆమె ఒళ్ళు వంపులు నా కంటికి యిక కనపడలేదు. ఆమె యింకా కూర్చోలేదు. నేను చలికి కామోసు వణుకుతున్నాను. నేను ఆమె అక్కడ వున్నాం. ఇంతలో తలుపులు తెరవబడ్డాయ్. వాడిని ఒక మంచంమీద వేశారు. ఆమె వాడిమీద పడిపోబోతుంటే మా వాడు కొద్దిగా ప్రక్కకు వుండమన్నాడు.

"నీపని సరా..."

"లేదు. ఈ రెండు శవాలను పోస్టుమార్టమ్ చెయ్యాలి. నువ్వింటికి వెళ్ళకూడదూ?"

ఆ రాత్రి వాడు యింటికి వచ్చేసరికి పన్నెండు గంటలైంది. నేను యింకా తెలివిగానే వున్నాను. ఒకసారి లేచి ఆసుపత్రికి వెళ్ళాలని మనసుపుట్టేది.

"వాడి పెళ్లాం యెలాగుంది?" అన్నాడు మా వాడు ఆ రాత్రి.

"అమోఘంగా వుంది."

"మీద చెయ్యి వెయ్యగలవు. ఆడపులి మీదకు వురికినట్లు వురుకుతుంది."

"ఇంతకీ జరిగిందేమిటి?"

"వాడి అరుపులు నీకు అర్థం కాలేదు కదూ?"

"ఆవేశంతో అంటున్నాడని మాత్రం చెప్పగలను."

"ఈ క్రొత్త రేంజరు ఛండశాసనుడన్నాను కదా? ఆర్డర్లు అమలుపర్చడానికి నెట్టుకున్నాడు. అడవులు కాల్చకూడదు. కలప బయటకు తీసుకువెళ్తే పన్ను కట్టాలి. పండించినా పన్ను కట్టాలి. ఈ కోదువాడు అడవులు కాలుస్తున్నాడు. పన్ను కట్టకుండా కలప కొట్టున్నాడు. పండించి పన్నులేదు పొమ్మంటున్నాడు. చివరికి ఒక్కడేకదా ఏం చెయ్యగలడని ఈ యిద్దరు ఫారెస్టు గార్డులు, వాడు అడవి కాల్చడానికి వెడితే అడ్డుకున్నారు. ఒకడి గుండెలో బాణం నాటాడు. రెండోవాడి గుండెలోనూ నాటాడు. వాడు అంతలో తుపాకి పేల్చాడు. గుండు వీడితొడలో వుండిపోయింది. ఆ బాణాల్లో విషం వుంటుంది. అందుకే వాళ్లు చచ్చారు."

"వాడు యేమిటలా అరుస్తున్నాడు?"

"ఇది మా రాజ్యం. మా తావు. మా ముత్తాతలు అడవిని కాల్చారు. మేం కాలుస్తాం. మా ముత్తాతలు పన్నులు యెప్పుడూ కట్టలేదు. మేమూ కట్టం. మీ బట్టా-పాతా మాకొద్దు. మీ వేషాబాసా మాకొద్దు. మా రాజ్యంలో మమ్మల్ని

అడ్డుకోడానికి, మా యిచ్చను కాదనడానికి మీరెవరు? మా జాగాల్లో అడుగెట్టింది కాకండా మమ్మల్నిలా నాశనం చెయ్యడానికి నెట్టుకున్న పిశాచాలు మీరు! పోండి... పోతారా... లేదా?"

మా బావ అంటున్నా నేను ఆ కోదువాడు అంటున్నప్పుడు పొందే ఆవేశమే పొందాను.

"పులివేటకు యింకోరోజు వెళ్దాంలే" అన్నాడు, మా బావ పరుపు మీద వాలుతూ. మా పెద్దమ్మ భర్తను పులి యెందుకు యెత్తుకుపోయిందో ఇప్పుడు నాకు అర్థమయ్యింది.

"మరెందుకు? అప్పుడే గుండుదెబ్బతిన్న పులిని చూశాను."

*(జ్యోతి, దీపావళి ప్రత్యేక సంచిక, 1965)*

✱✱✱